క్లుప్తంగా

మహిళలను కించపరిచే టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలి

పొన్నూరు: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే టీడీపీకి వచ్చే ఎన్నికలలో మహిళలు తగిన బుద్ధి చెప్పాలని పొన్నూరు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు కోరారు. రాష్ట్ర మంత్రి రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పట్టణంలో వైఎస్సార్ సీపీ మహిళ నాయకులు, మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు కంచెర్ల మాణిక్యం మాట్లాడుతూ మహిళల పట్ల దురుద్దేశపూర్వకంగా మాట్లాడే టీడీపీకి గత ఎన్నికల్లో ఓటమితో తగిన బుద్ధి చెప్పామని అన్నారు. టీడీపీ నేత బండారు సత్యనారాయణ మంత్రి రోజాకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు గేరా కుమారి, ఇండ్ల రాజ్యలక్ష్మి, ఎం.అనిల్ కుమారి, మహిళలు పాల్గొన్నారు.

వీవీఐటీలో మ్యాడ్ చిత్ర బృందం సందడి



పెదకాకాని: యువ నటీనటులు నార్నే నితిన్, సంగీత్‌శోభన్, రామ్ నితిన్, శ్రీగౌరీప్రియారెడ్డి, అనంతిక, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన మ్యాడ్ చిత్ర బృందం గురువారం నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. అక్టోబరు 6 న కళ్యాణ్‌శంకర్ దర్శకత్వంలో హారిక, హాసిని, సితారా బ్యానర్‌పై హాస్య ప్రధానంగా రూపొందుతున్న చిత్రం మ్యాడ్ విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా వీవీఐటీలో సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్ర హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ హాస్య ప్రధానంగా అందరినీ ఆకట్టుకునే విధంగా ఈ చిత్రం రూపొందించబడిందన్నారు. జూనియర్ ఎన్‌టీఆర్ విడుదల చేసిన టీజర్ చిత్రంపై ఆసక్తి పెంచిందన్నారు. విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రనటీనటులు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

కాకుమాను: విద్యార్థులకు విద్యా బుద్ధులు, క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించి సమాజంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు.అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపక వృత్తి నుండి అంచెలంచెలుగా ఎదిగి భారతదేశానికి రెండు సార్లు ఉప రాష్ట్రపతిగా పని చేసి దేశానికి, ప్రజలకు ఎంతగానో సేవచేశారని ఆయన తెలిపారు. అలాంటి వ్యక్తి జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు గేరా మోహనరావు, శీలం అంకారావు, వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, రవి కుమార్, ప్రకాష్‌రావు, ప్రమీలాదేవి, సుధారాణి, రిహాన, శివ కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, పుష్పావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జీవిత బీమా ద్వారా 10 వేల అందజేత

పెదకాకాని : కుటుంబ యజమానిని కోల్పోవడం బాధాకరమని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని గ్రామంలోని స్వర్ణపురికాలనీలో గురువారం బత్తుల నరేంద్రబాబు (37) మరణించారు. ఆయన గత కొంతకాలంగా (బ్లడ్ క్యాన్సర్) అనారోగ్యంతో బాధపడుతున్నారు. వలంటీర్ ద్వారా మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న సర్పంచి గోళ్ళ స్వరూపరాణి వైఎస్సార్ జీవిత బీమా పథకం ద్వారా 10 వేల రూపాయలు, తన సొంత నగదు 5 వేల రూపాయలు మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని భార్యకు అందజేశారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్ జీవిత బీమా పథకం ద్వారా సహజ మరణానికి లక్షరూపాయలు అందజేస్తున్న సంగతి విదితమే. ఈ నగదు అందజేసిన వారిలో సర్పంచితో పాటు సచివాలయం 2 వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ నాజియా బేగం ఉన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు స్టాటిస్టిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 10లోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో 55 శాతం కంటే ఎక్కువ మార్కులున్న వారు అర్హులని, పీజీతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు కళాశాలలోని గణిత శాస్త్ర విభాగంలో దరఖాస్తుల్ని సమర్పించాలని సూచించారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలకు స్పందన అద్భుతం



కోయవారిపాలెంలో సురక్ష శిబిరానికి హాజరై ఓపీ రాయించుకుంటున్న ప్రజలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు



అప్పాపురంలో వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వృద్ధురాలికి దగ్గరుండి వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్య పరీక్షల కోసం వేచి చూస్తున్న ప్రజలు

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. స్పెషలిస్టు వైద్యాధికారులు శిబిరాలకు హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తుండటంతో వందల సంఖ్యలో రోగులు హాజరవుతున్నారు. కేర్ షీట్లు పట్టుకుని క్యూ కడుతున్నారు. మండల పరిధిలోని కోయవారిపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 252 మంది రోగులు హాజరయ్యారు. వీరికి జనరల్ డాక్టర్లు డాక్టర్ కె. స్రవంతి, ఏ వంశీ, రేడియాట్రిక్ డాక్టర్ పి.జలీల్ బాషా, గైనకాలజిస్ట్ డాక్టర్ డి.అంజనీదేవి, ఆప్తాలమిక్ డాక్టర్ ఆర్.వంశీలు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 32 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కాగా మిగిలిన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, పీహెచ్ఎన్ డి.నిర్మలదేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. జనులందరికీ రక్ష

ప్రత్తిపాడు: రాష్ట్రంలో ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) అన్నారు. గుంటూరు రూరల్ మండల పరిధిలోని లాలుపురం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీతారామాంజనేయులు ప్రారంభించారు. వైద్యాధికారులు, రోగులతో మాట్లాడారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీతో ఆయన నాడు ఒక అడుగు ముందుకు వేస్తే, నేడు ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి వైద్యశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ నాలుగడుగులు ముందుకు వేస్తూ తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో తండ్రిని మించిన తనయుడుగా సీఎం పేరు తెచ్చుకున్నారని చెప్పారు. కోవిడ్ వంటి సంక్షోభాన్ని సైతం తన ముందు చూపుతో ఎదుర్కొని దేశంలోనే అత్యుత్తమ వైద్య సేవలు అందించిన రాష్ట్రంగా ఏపీని నిలిపారన్నారు. కార్పొరేట్ విద్య,వైద్యాన్ని మనకు అందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఆయననే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని లాలుపురం రాము పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, జెడ్పీ సీఈఓ మోహనరావు, మండల ప్రత్యేకాధికారి వజ్రశ్రీ, ఎంపీడీవో సాంబశివరావు, లాలుపురం ఎస్ఓ కర్నాటపు శ్రీనివాసరావు, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగటకే వైద్య సేవలు

అప్పాపురం(కాకుమాను): ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంపద కంటే ఆరోగ్యమే ముఖ్యమని అలాంటి ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరికి అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరాలలో అనుభవజ్ఞులైన వైద్యులచే 14 రకాల డయాగ్నస్టిక్ కిట్స్‌లతో పరీక్షలు నిర్వహించి 172 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు గ్రామాలలో శిబిరాలు నిర్వహించి అనేక లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు వైద్య శిబిరాలను ఉపయోగించుకుని ఆరోగ్య వంతులుగా ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి, సర్పంచ్ పొందుగుల ఆచారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

353 మందికి వైద్య పరీక్షలు...

పెదనందిపాడు: ప్రభుత్వం అందరికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ రోజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 353 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల ప్రత్యేక అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.మనోరంజని తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొప్పర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించిన మనోరంజని పలువురు రోగులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు తమ సమస్యలను మండల ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలందరికి అవసరమైన వైద్య పరీక్షలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి చేస్తారని, అత్యవసరమైతే హాస్పటల్‌కు వారే సిఫారసు చేస్తారని ఆమె తెలిపారు. ప్రజలకు అవసరమైనా అన్ని రకాల మందులను కూడా శిబిరం వద్ద పంపిణీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో తహసీల్దార్ సుభాని, ఈఓపీఆర్డీ సాయిలీల, సర్పంచ్ సాతులూరి సురేష్, ఉప సర్పంచ్ యేలూరి శ్రీకాంత్, వైద్యాధికారులు జి.లావణ్య, ఎండి అతియా, వి.అనిల్ కుమార్, మేరి యునిక, సీహెచ్‌వో ప్రసాద స్వామి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెదకాకానిలో సురక్ష శిబిరం

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నవారందరూ వైద్యసేవలు పొందే విధంగా పెదకాకానిలో ఇంటింటి సర్వే నిర్వహించి గుర్తించడం జరిగింది. వైద్య నిపుణుల పర్యవేక్షణలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, అలానే కంటి వైద్య పరీక్షలు కూడా చేయడం జరుగుతుందన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలభీమసేన భీమయ్య గౌడ్ కుటుంబ సమేతంగా గతనెల 28న గుంటూరులోని భారత్‌పేట 9వ లైనులో నివసించే బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఆయన కుమారుడు రామాంజయ్య (22) బంధువులకు చెందిన మరో రేకుల గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా తులసి రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ నేత తులసి రామచంద్రప్రభు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తులసి రామచంద్ర ప్రభు, బీజేపీ నాయకుడు తులసి యోగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. యువత మద్యానికి బానిసలుగా మారి విలువైన జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు యువతలో వినియోగాన్ని తగ్గించే మార్గాలపై పురందేశ్వరితో చర్చించారు. పార్టీ అధ్యక్షురాలిగా ఆమె సేవల్ని కొనియాడారు.

చిరునవ్వుతో ప్రయోజనాలపై నేడు అవగాహన

గుంటూరు మెడికల్: చిరునవ్వుతో అనేక ఉపయోగాలు ఉన్నాయని డాక్టర్స్ స్మైల్ క్లబ్ వ్యవస్థాపకుడు, డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 6న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ చిరునవ్వు దినోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటలకు స్థానిక ఎస్వీఎన్‌కాలనీ పార్కులో, ఉదయం 10 గంటలకు కొత్తపేట పశువుల హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో, కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని కారుమూరి హాస్పిటల్‌లో ఉదయం 11 గంటలకు, అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో మధ్యాహ్నం 3 గంటలకు, పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు చిరునవ్వు ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రతే లక్ష్యం

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- శలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



శిబిరానికి హాజరైన గ్రామస్థులు



మండల పరిధిలోని శలపాడులో



మహిళకు ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య



శలపాడు గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు

శలపాడు(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. దానికి విశేష స్పందన లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఊరూరా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే అభివృద్ధి సాధించినట్లు అన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటాలు, ప్రచారాలు ఎక్కువ చేసిందని, అభివృద్ధి శూన్యమన్నారు. 40 సంవత్సరాల అనుభవం ఉన్న నాయకుడు, ప్రస్తుతం జైలులో ఉన్న నేత జగన్‌మోహన్‌రెడ్డి లాగా సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ సేవలను గడప వద్దకే తీసుకువచ్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే తీసుకువచ్చి పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సాహితి, ఎంపీడీవో బి.బాబురావు, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, కిరణ్, స్థానిక నాయకులు మన్నెం వేణుగోపాలరావు, బాలచంద్రయ్య, ఉయ్యూరు వెంకటేశ్వరమ్మ, సీడీపీవో ఎస్ వెంకటరమణ, సూపర్‌వైజర్ జి.శేషమ్మ, డాక్టర్లు కొత్తపల్లి బాబురావు, మీసాల వేణుగోపాల్, సీహెచ్ శైలజ, పర్వీన్, ఎన్ క్రాంతి కుమార్, కె.వజ్రం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్య సేవలు

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి గ్రామంలో ఇంటివద్దకే వైద్య సేవలు వచ్చాయని అందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. గురువారం పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు గ్రామంలో ఎంపీయూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ముందుగా గ్రామాల్లో వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చికిత్స అవసరమైన వారికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. గత ప్రభుత్వం ఆస్పత్రులను, పేదల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్లు ఏర్పాటుచేసి ఇంటికే వైద్య సేవలు తెచ్చారన్నారు. దేశంలోనే ఇలాంటి ప్రయత్నం ఎవరూ చేయలేదన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

అప్పాపురం(కాకుమాను): అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పోషకాహారంతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. మండలంలోని అప్పాపురంలో గురువారం పోషకాహార ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథ/గా పాల్గొన్న ప్రేమ కుమారి మాట్లాడుతూ బాల్యం నుంచే మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన ఎదిగే కొద్దీ చిన్నారుల్లో శరీర దారుఢ్యం పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. బాల్యం దశలోనే చిన్నారులకు మంచి ఆరోగ్యం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. చిరు ధాన్యాలు, ఆకు కూరలతో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి రోజు మంచి రుచికరమైన అహార పదార్థాలను అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహారాలను రుచి చూశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ పొందుగుల ఆచారి, షేక్ అసదుల్లా, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ కుమారి, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాతగుంటూరు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్స్, బేకరీ దుకాణాల్లో ఆహార పదార్థాల్ని అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఏటీఎం సత్యనారాయణ వ్యాపారులకు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం బస్టాండ్‌లోని పలు దుకాణాల్ని ఆయన తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణదారులకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఇకపై అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లకు సూచించారు. గురువారం మండలంలోని కట్టెంపూడి గ్రామంలోని కల్యాణ మండపంలో 'ఎందుకు ఆంధ్రకు జగన్ కావాలంటే' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకుని, అన్నింటిని నెరవేరుస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నేటికీ 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల అరవై వేల వలంటీర్లను నియమించడంతోపాటు ఒక లక్ష 30 వేల మంది సచివాలయ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో ఆరు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. దేశంలోనే పారదర్శక పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వం అన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళుతున్నాయంటే అది ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యమైందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. గత టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలు సూచించిన వారికే అందించారన్నారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి కన్నా స్కాముల గురించే ప్రజలు ఎక్కువగా చర్చించుకుంటున్నారని అన్నారు. అవినీతి, అక్రమాలలో ఆరితేరిన చంద్రబాబు పాలనను చూసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని వచ్చే ఎన్నికలలో కూడా టీడీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలన్నారు. కోట్ల రూపాయల వ్యయంతో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్. సైఫుల్ల, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎంఏ మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, అంజుమన్ అధ్యక్షుడు షేక్ మాము, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్ర పాములు, మహిళా నాయకురాలు అనిల్ కుమారి, గేరా కుమారి, ఇండ్ల రాజ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.